జగన్న విద్యాదీవెన మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

జగనన్న విద్యాదీవెన సాయం రూ.23.79 కోట్లు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జగనన్న విద్య దీవెన ద్వారా జిల్లాలో విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.23.79 కోట్లు జమ అయ్యిందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, అగ్రి బోర్డు ఛైర్మన్ ఎటి.రమణారెడ్డి, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగ వ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అమలు చేస్తూ పేద విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నారని ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 35044 మంది విద్యార్థులకు సంబంధించి 32,004 మంది తల్లుల ఖాతాలో నేరుగా 23,79,32,337 రూపాయలు అందుతుందన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులు మెగా చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రామ్, వసతి గహాల సంక్షేమ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాధవ్ ముద్రేది..!?

◆ ఊహించకుండా ఎంపీ అయ్యారు... ఇప్పడు కనుమరుగయ్యారు ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోలీసు అధికారిగానున్న ఆ ఎంపీ ఉన్నఫలంగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. పోటీ చేసిన మొదటి సారే ఎంపీగా కూడా గెలిచారు. పోలీసు అధికారిగానున్న సమయంలోనూ ఆయన చుట్టూ అనేక వివాదాలున్నప్పటికీ ఏదో రకంగా నెట్టుకొస్తూ వచ్చారు. అయితే ఎంపీ అయిన తరువాత చుట్టుముట్టిన వివాదం ఆయన మొత్తం జీవితాన్నే దెబ్బకొట్టేసిందా అన్నట్టుగా మారింది. మహిళతో నగ్నంగా వీడియో మాట్లాడారంటూ సోషియల్ మీడియాలో సాగిన ప్రచారంతో ఆయన ప్రతిష్టను దెబ్బతీసింది. ఆ వీడియోపై పెద్ద దుమారమే రేగి, తరువాత చల్లారినప్పటికీ ఆయనకు మాత్రం మాయని మచ్చగానే మిగిలింది. అప్పటి నుంచి ఆయన రాజకీయంగానూ అంత క్రియాశీలకంగా కనిపించడం లేదన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తదితరులు ముఖ్యమైన నాయకులు వచ్చినప్పుడు తప్పా తక్కినప్పుడు ఎక్కడా ఆయన కనిపించడం లేదు. పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల సమీక్షల్లోనూ ఆయన ఆచూకీ లేదనే చెప్పాలి.

అభివృద్ధిలో కనిపించని ముద్ర

హిందూపురం పార్లమెంటు సభ్యులుగానున్న గోరంట్ల మాధవ్ తన నియోజకవర్గం పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర కనిపించలేదన్న విమర్శలున్నాయి. కేంద్రం ద్వారా వచ్చే నిధులతో చేపట్టే కార్యక్రమాలు అనేకముంటాయి. వాటిని సాధించేందుకు ఆయన పెట్టిన కృషి ఏమిటన్నది తెలియని పరిస్థితి నెలకొంది. ఒకవైపు ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి ప్రాంతాల్లో చేనేత పరిశ్రమ విరివిగా ఉంది. ఈ పరిశ్రమకు కేంద్రం ఊతమిస్తోంది. అక్కడి నుంచి ప్రత్యేకమైన నిధులు రాబట్టలేకపోయారన్న విమర్శలున్నాయి. అదే విధంగా ఈ ప్రాంతంలోనే పట్టు పరిశ్రమ ఉంది. ఈ పట్టు రైతులకు, రీలర్లకు రావాల్సిన రాయితీలు రాలేదు. దీనిపైనా ఆయన స్పందించిన దాఖలాలు ఎక్కడా లేవు. ఇక రైల్వేకు సంబంధించి కొత్త ప్రాజెక్టు ఏఒక్కటీ ఈ నాలుగేళ్లలో సాధించలేకపోయారు. ఇక కేంద్ర సంస్థలైన నాసన్, బెల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాటి కోసం ఆయన కృషి చేసింది శూన్యమేనని ఆ ప్రాంతవాసులు విమర్శిస్తున్నారు.

ఈసారీ అవకాశం లేనట్టేనా ?

మరికొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థుల అన్వేషణ మొదలుపెట్టాయి. వైసిపి కూడా ఎవరైతే సరిపోతారన్న దానిపై దృష్టి సారించిందనే చర్చ సైతం నడుస్తోంది. అయితే మాధవ్‌కు ఈసారి అవకాశం దాదాపుగా లేదనే ప్రచారమే సాగుతోంది. దీంతో కొత్తగా టిక్కెట్టు ఆశించే వారు సైతం తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ముఖ్యమైన నాయకులను, ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులను కలువడం, తమకు అవకాశం కల్పించాలన్న విజ్ఞాపనలను సైతం అందజేస్తున్నారు. అయితే మొదట అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి సారించిన నేతలు పార్లమెంటు సభ్యులపై ఇంకా అంత సీరియస్‌గా దృష్టి సారించలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆలస్యం కాకుండా అర్జీలకు పరిష్కారం

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ సమస్యలపై స్పందన గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే అర్జీలపై ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులతో కలిసి 232 అర్జీలను స్వీకరించారు. అనంతరం వర్చువల్ విధానం ద్వారా వివిధ మండల స్థాయి అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. రీ ఓపెన్ పిటీషన్లు రాకుండా నాణ్యతగా వాటికి పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు స్పందిస్తే మళ్లీమళ్లీ అవి పునరావృతం అయ్యే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగు ప్రజల ఆరాధ్యదైవం, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రతిమను వంద రూపాయలు నాణెంపై ముద్రింపు తెలుగు ప్రజలు గర్వించే దగ్గ గుర్తింపు అని, ఇదే విధంగానే ఎన్టీఆర్‌కు భారత రత్న ఇచ్చే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ కోరారు. రూ.100 నాణెంపై ఎన్టీఆర్ ప్రతిమ ముద్రించిన దానిని తీసుకుని చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం రూ.100 నాణంపై ఎన్టీఆర్ ప్రతిమను ముంద్రించడం తెలుగు ప్రజలకు గర్వకారణం అన్నారు.

ముంద్రించిన కాయన్‌ను చూపిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

సంబరాలు జరుపుకున్న 'పురం' టిడిపి నాయకులు

కేంద్ర ప్రభుత్వం రూ.100 నాణెంపై ఎన్టీఆర్ ప్రతిమను ముద్రించడం తెలుగు ప్రజలకు గర్వకారణం అని, ఎన్టీఆర్ సినీ కళా రంగానికి, రాజకీయ రంగానికి చేసిన సేవలకు తగిన గుర్తింపు రావడం తెలుగు ప్రజలకు ఆనందం అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. రూ.100 నాణెంపై ఎన్టీఆర్ ప్రతిమను ముద్రించి సోమవారం ఢిల్లీలో విడుదల చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ నందు సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు డి.ఇ.రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు షఫీవుల్లా, కొల్లకుంట అంజినప్ప, రామాంజినమ్మ, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు అమర్నాథ్, పరిమళ, మీడియా కో ఆర్డనేటర్ చంద్రమోహన్ యాదవ్, పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు జేపీకే రాము, నాయకులు రాము, మారుతి ప్రసాద్, ప్రియా గంగాధర్, మురళి స్వామి, నాగేంద్ర, మహిళా నాయకులు విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, చెన్నమ్మ, గీతమ్మ, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపిపి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పందన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, తహశీల్దార్ కరుణాకర్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

ప్రజాశక్తి-బత్తలపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సౌజన్యకుమారి, ఏపీవో ఆదెప్ప తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 01-04-2022 నుంచి 31-03-2023 వరకు జరిగిన వివిధ పనులపై 18-8-2023 నుంచి 28-08-2023 వరకు సామాజిక తనిఖీలు జరిగినట్లు తెలిపారు. ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై ప్రజా ప్రతినిధులతో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ప్రజా వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

జిల్లా కమిటీలో 'పురం' వాసులకు చోటు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి జిల్లా కమిటీలో పురం వాసులకు చోటు లభించింది. జిల్లా కమిటీలో హిందూపురం నియోజకవర్గం నుంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాల్మీకి లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా ఇలియాజ్, జిల్లా కమిటీ సభ్యునిగా కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు చోటు కల్పించారు. నూతనంగా ఎంపిక అయిన వారిని వేణురెడ్డి తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు అబ్దుల్ ఘనీ, వైసిపి నాయకులు సోమశేఖర్ రెడ్డి, రమణ, వాల్మీకి సుభాష్ గాంధీ పాల్గొన్నారు.

యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో పని చేస్తున్న విఎ(యానిమేటర్లు)కు ఉద్యోగ భద్రత కల్పించాలని యానిమేటర్లు కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సౌజన్యకుమారి, ఏపీ ఎం.సుదర్శన్‌రాజులను ఆయా కార్యాలయాల్లో యానిమేటర్లు కలిసి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యానిమేటర్లు మాట్లాడుతూ విఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హెచార్ పాలసీని అమలు చేయాలన్నారు. అర్హత కలిగిన విఓఏలకు సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. మూడు సంవత్సరాలు కాలపరిమితి జీవోను రద్దు చేయాలన్నారు. అనంతరం విఓఎల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రామలక్ష్మి, ఉపాధ్యాయురాలుగా రమాదేవి, కార్యదర్శిగా బండి ఆదినారాయణ సహాయ కార్యదర్శిగా వీరనారప్పను ఎన్నుకున్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-గోరంట్ల

చంద్రయన్-3 విజయవంతంపై పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సోమవారం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. జయహో ఇస్రో జయహో చంద్రయన్ జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 విజయవంతం చేయడానికి చేసిన కషి అద్భుతం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇర్షాద్, ఏవో నాగరాజు కోఆర్డినేటర్ నాగభూషణ, ప్రైమరీ ఇన్‌ఛార్జి అనిత ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి సుమియా భానుమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న చైతన్య విద్యార్థులు

విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు

◆ వ్యవసాయానికి తొమ్మిది గంటల కరెంట్ ఇవ్వాలి ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-కనగానపల్లి

విద్యుత్ కోతలతో జిల్లా వ్యాప్తంగా రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, దీనిపై ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. కనగానపల్లి మండలంలో ఎండుతున్న వేరుశనగ పంటలు, చెరువులను సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరెప్పతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఓ వైపు వర్షాలు లేక మరో వైపు ప్రభుత్వం సరైన విద్యుత్ అందించక రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట ఎండిపోతోందన్నారు. అప్రకటిత కరెంటు కోతలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనగానపల్లి మండలంలో చెరువులు కూడా ఎండి పోతున్నాయన్నారు. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే ఎండుతున్న చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజాప్రతినిధులు ఓట్ల రాజకీయాలు మాని జిల్లా రైతుల సమస్యలపై స్పందించాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు నాణ్యమైన తొమ్మిది గంటల విద్యుత్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం చూస్తే ఏడు గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ అందించని పరిస్థితి ఉందన్నారు. అవసరమైనన్ని ట్రాన్స్‌ఫార్మర్లు లేక పోవడంతో రైతుల మోటార్లు కాలి పోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం తీరుతో రైతులు పంటలు సాగు చేయాలంటనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల న్యాయమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఎండిన పంటలను పరిశీలిస్తున్న ఇంతియాజ్

30 నుంచి ప్రచారభేరి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలన, విద్యుత్ చార్జీల పెంపు, నిరుద్యోగం, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రచారభేరి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇంతియాజ్ తెలిపారు. 30న సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయాల్లో వినతిపత్రాల అందజేత, 3న నిరుద్యోగ వ్యతిరేకం దినం, 4న మండల కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక పూజలో పాలొన్న వైసిపి నాయకులు



ప్రత్యేక పూజలో పాల్గొన్న కొటిపి హనుమంత రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కొటిపి గ్రామంలో వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి తన నివాసంలో శ్రీమ సత్యనారాయణ స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి, చల్లాపల్లి బాబురెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు అబ్దుల్ ఘనీ, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరాం రెడ్డి, నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, వైసిపి నాయకురాలు మధుమతిరెడ్డి, లేపాక్షి మండల జడ్పిటిసి సభ్యులు బాణాల శ్రీనివాస్ రెడ్డి, హిందూపురం లేపాక్షి మండలాల కన్వీనర్లు నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, నారాయణస్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసిలు పాల్గొన్నారు.

స్వీపర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో స్వీపర్లు, ఆయాలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాలు చాలీచాల ని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కానీ అధికారులు కానీ వారి సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. స్వీపర్లు, ఆయాలకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి యూనిఫామ్ మంజూరు చేసి ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సరోజమ్మ, జిల్లా నాయకురాళ్లు హుస్సేనమ్మ, ఇందిర, షాహిన, ముంతాజ్, చౌడమ్మ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

బషీర్‌బాగ్ పోరాట స్ఫూర్తితో విద్యుత్ ఉద్యమం

ప్రజాశక్తి-హిందూపురం

పెంచిన విద్యుత్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జడ్పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ సంస్థను ప్రయివేటుపరం చేసి, ప్రజలపై భారాలు వేసిందని, తద్వారా అధికారం కోల్పోయిం దన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచడంతో పాటు నాలుగేళ్ల నుంచి ప్రజలపై పన్నుల రూపంలో అనేక భారాలు వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు విఆర్ రాము, కల్లూరు రాజప్ప, రమణ, నరసింహప్ప, గోవిందు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, బాబు, మారుతిరెడ్డి, ఫక్రుద్దీన్, నారాయణరెడ్డి, అలీమ్, నౌషాద్, ఖలీల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ అమరవీరులకు నివాళి

కదిరి టౌన్ : 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ ర్యాలీ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించిన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలకు సోమవారం సిపిఎం కార్యాలయంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.సుబ్బిరెడ్డి, నాయకులు సాంబశివ, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, శంకర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్‌జాన్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో 2000 సంవత్సరం ఉమ్మడి ఎపిలో అప్పటి టిడిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, నాణ్యమైన విద్యుత్ అందించాలని, రైతులకు ఉచిత విద్యుత్‌పై ప్రపంచ బ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారిని ఆదర్శంగా తీసుకొని ఇప్పటి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు.

వాణిజ్య విభాగం అధ్యక్షుడికి సన్మానం



కిశోర్‌ను సన్మానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షుడుగా ఎన్నికైన కట్ట కిషోర్ టిడిపి మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి కిషోర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, కన్నా సాధికారిక కన్వీనర్లు గోవిందప్ప, రామాంజనేయులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

బత్తలపల్లి : ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి అందే ప్రజా సమస్యలపైన దష్టి సారించాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌజన్యకుమారి, ఏపీవో ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్ రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏవో ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఎఇ శివయ్య పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే జీవనమెలా?

ప్రభుత్వానికి సత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికుల సూటి ప్రశ్న

ప్రజాశక్తి-హిందూపురం

నెల నెలా వేతనాలు చెల్లించకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ కార్మికులు ఆందోళన చేసి, తహశీల్దార్ హసీనా సుల్తానకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో దాదాపు 600 మంది కార్మికులు 12 ఏళ్ళుగా పని చేస్తున్నా ప్రభుత్వం సకాలంలో వేతనాలు, పిఎఫ్ చెల్లించకుండా కాలయాపన చేస్తోందన్నారు. 20 రోజులుగా శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేసినా స్పందించలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనకు న్యాయవాదుల సంఘం నాయకులు శివశంకర్, ఈశ్వర్, ఎంఎస్ఎఫ్ రవికుమార్ మద్దతు పలికారు. కార్యక్రమంలో సిఐటియు రూరల్ కన్వీనర్ రాము, పట్టణ నాయకులు కల్లూరు రాజప్ప, శ్రీరామిరెడ్డి వాటర్ స్కీమ్ యూనియన్ సెక్రటరీ బాబు, అధ్యక్షులు రంగస్వామి, ఆటో యూనియన్ నాయకులు గోవిందు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రి ఇస్తున్న సిఐటియు నాయకులు

ఆకులు తింటూ సత్యసాయి కార్మికుల నిరసన

ధర్మవరం టౌన్ : బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని, లేదంటే కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని సత్యసాయి నీటి విభాగం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని స్థానిక లక్ష్మీ చెన్నకేశవపురం పంప్ హౌస్ వద్ద ఆకులు తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 5 నెలలుగా తమకు వేతనాలు అందలేదని, ఇలా అయితే మా కుటుంబాలను ఎలా పోషించు కోవాలని ప్రశ్నించారు. ధర్నాలో సత్యసాయి కార్మికులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

బత్తలపల్లి : సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ కళ్లకు నల్లని గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు.

ధర్మవరం పంప్ హౌస్ వద్ద ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బత్తలపల్లిలోని మంచినీటి ట్యాంకు వద్ద మండలంలో పని చేస్తున్న సత్యసాయి కార్మికులు కళ్లకు నల్లటి గుడ్డలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, ఈఎస్ఐ, ఈపిఎఫ్ డబ్బులు చెల్లించలేదన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి జగన్ మారుతి, మహబూబ్ బాషా, షేక్ మహబూబ్ బాషా, ఓబులేసు, శంకరయ్య, అనంతయ్య, మురుగేష్, రామ్మోహన, జయరాము, సద్గురు, నరసింహులు, కేశవ సిద్దయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

పెనుకొండ : శ్రీసత్యసాయి తాగునీటి కార్మికులు 810 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చడానికి కృషి చేస్తున్నారని, అలాంటి వారికి 5 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమని జిల్లా టిడిపి అధ్యక్షులు బికె పార్థసారథి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీసత్యసాయి తాగునీటి పథకం ద్వారా దాదాపు వెయ్యి గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందిస్తున్నారని, అలాంటి కార్మికులకు కనీసం వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వెంటనే కార్మికులకు వేతనాలు చెల్లించాలని, పథకం నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న టిడిపి కార్యాలయంలో సోమవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ప్రజాశక్తి దినపత్రిక 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తుందని కొనియాడారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావడంలో ముందుంటుందని తెలిపారు. ముఖ్యంగా కార్మికులు, కర్షకులు, రైతుల పక్షాన నిలుస్తుందని అభినందించారు. ఇలాగే పారదర్శకంగా వార్తలు రాస్తూ మరెన్నో వార్షికోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాశక్తి దినపత్రికను ప్రతి ఒక్కరూ ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అనంతపురం ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్, డివిజన్ ఇన్‌ఛార్జి ఆర్.తిమ్మప్ప, స్టాఫ్ రిపోర్టర్ హెచ్.గోవిందప్ప, పాత్రికేయులు నాగరాజు, లోకేష్, ప్రజాశక్తి దినపత్రిక వీరాభిమాని సిద్దేష్, మాజీ డీలర్ డి.రంగప్ప, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్, సాధికారిక కన్వీనర్లు రామాంజనేయులు, గోవిందప్ప, నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కట్టా కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న గుండుమల తిప్పేస్వామి, తదితరులు

భూఅక్రమాలపై సమగ్ర విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని సర్వే నెంబర్-83లో చోటు చేసుకున్న భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సిపి) జిల్లా కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్‌సిపి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కి సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం నాగన్న మాట్లాడుతూ కొందరు రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్-83లో పట్టాలు సృష్టించి ప్రయివేట్‌గా ఓ దళారీని ఏర్పాటు చేసుకొని పట్టాకు రూ. లక్ష నుంచి రూ. 3 లక్షలు వరకు వసూలు చేసి పలువురికి పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. కోట్లాది రూపాయిలు దోచుకొని దొంగ పట్టాలు ఇచ్చి అవినీతికి పాలపడిన రెవెన్యూ అధికారులు, నారాయణపాల్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి దశల వారీగా నిరంతరం పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కదిరి డివిజన్ కార్యదర్శి ఇలియాజ్, ఆర్ఎంఎ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు అరుణ్‌కుమార్, రాజేష్, మణి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని కాలువేపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీరంగనాథ స్వామి ఆలయం వద్ద కళ్యాణ మండపం నిర్మాణానికి సోమవారం మల్లినమడుగు గ్రామానికి చెందిన రామచంద్రప్ప రూ. 20 వేలు విరాళం అందజేశారు. ఈయన వత్తిరీత్యా బెంగళూరులో స్థిరపడ్డారని ఆలయ కమిటీ నిర్వాహకులు హెచ్‌టి హళ్లి శ్రీరంగప్ప రమేష్, రాజన్న, తదితరులు తెలిపారు. కళ్యాణ మండపం నిర్మాణానికి భక్తులు, ప్రజలు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు కోరారు.

రైతుకు ఆర్థికసాయం

కొత్తచెరువు : మండల పరిధిలోని పోతులకుంట గ్రామానికి చెందిన రైతు రాములుకి వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి రూ. 10వేలు అందజేశారు. ఇటీవల జగరాశపల్లెలో జరిగిన ఎద్దుల బండ్ల పరుగు పందెం పోటీల్లో పాల్గొనగా ప్రమాదం జరగడంతో రాములుకు చెందిన ఎద్దుకు గాయాలయ్యాయి. దీనికి తోడు రాములు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న సోమశేఖర్‌రెడ్డి సోమవారం పోతులకుంట గ్రామానికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి యువ నేత చక్రధర్‌రెడ్డి, మాజీ సర్పంచి లోచర్ల రాజారెడ్డి, వైసిపి నాయకులు శ్రీనివాసులురెడ్డి, గోవిందురెడ్డి, రెడ్డప్పరెడ్డి, లింగప్ప, రామచంద్ర, సూర్యప్రకాశ్‌రెడ్డి, మల్లికార్జున, మనోజ్‌కుమార్, రామిరెడ్డి పాల్గొన్నారు

పేద విద్యార్థికి చేయూత

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివిన డేనియల్ నాయక్ కర్నూలు నగరంలోని విశ్వభారతి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించాడు. అయితే అతడు మెడిసిన్ చదవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా ఉపాధ్యాయులు సోమవారం తమ వంతుగా రూ. 15వేలను హెచ్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయండి

కొత్తచెరువు : స్థానిక పెనుకొండ రహదారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న సోమవారం తహశీల్దార్ రామాంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి గుండా కియా బస్సులు, ద్విచక్ర వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నాయని, అయితే అక్కడ విద్యుత్ లైట్లు లేనందున రాత్రివేళ ప్రమాదాల జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కావున రైల్వే అధికారులు స్పందించి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిప్రసాద్, వెంకటరాముడు, నారాయణస్వామి, లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

మడకశిర : ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి టిడిపి అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. రొళ్ల మండల పరిధిలోని దొడ్డేరి పంచాయతీ పిలుగుండ్లు, కాకి పంచాయతీ కె.బ్యాడిగెరలో సోమవారం టిడిపి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి గతంలో టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, అలాగే ఇటీవల చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో, భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే రాబోయే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జికె ఈరన్న, నియోజకవర్గ కోఆర్డినేటర్ రామకృష్ణ, రాజన్న, మూర్తి, కాంతరాజు, శీనప్ప, మోహన్, హనుమంతరెడ్డి, కాంతరాజు, కృష్ణమూర్తి, చంద్రప్ప, లక్ష్మీపతి, నరసప్ప, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. దొన్నికోటవారిపల్లిలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన రామాంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు. ఆ గ్రామంలోనే అనారోగ్యానికి గురైన వెంకటనారాయణను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. అనంతరం పగడాలవారిపల్లిలో కొన్ని రోజుల క్రితం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో చోరీ జరగడంతో ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. అలాగే రికవరీ చేయాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, మైనార్టీ అధ్యక్షులు షామీర్‌బాషా, హనుమంతరెడ్డి, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదలపై సవితమ్మ హర్షం

ప్రజాశక్తి-పెనుకొండ

ఎన్టీఆర్ స్మారక రూ. వంద నాణెం విడుదలపై టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ స్మారకంగా నాణెం విడుదల చేయడాన్ని ఎన్టీఆర్‌కు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. మహిళలకు ఆస్తిలో హక్కును కల్పించిన మహనీయుడన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి తెలంగాణ ప్రజలకు నిజమైన స్వతంత్ర భారతాన్ని ఆవిష్కరింపజేశారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటారన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో తన దైన ముద్రవేశారన్నారు. ఎన్టీఆర్‌కి భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, సూర్యనారాయణ, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మంజునాథ్, సనావుల్లా ఫయాజ్, దాదు, మణికంఠ, బాబు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షులు బికె పార్థసారథి సమక్షంలో గొల్లపల్లి చాకలి శ్రీనివాసులు, చెరువుగేరి నంజుండ ఆధ్వర్యంలో పట్టణంలోని చెరువుగేరి, ఎగువగడ్డ, కుమ్మరిదొడ్డి, బిటిఆర్ కాలనీ, గోనిపేట తండాకు చెందిన 50 కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. వారికి పార్థసారథి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వీరందరూ వైసిపిని వీడి టిడిపి గూటికి చేరారు. పార్టీలోకి చేరిన వారిలో ఎస్ఎం షేక్షావలి, హుసేన్, బాబ్‌జాన్, రమేష్ నాయక్, లక్ష్మీనాయక్, మహేష్‌నాయక్, మారుతి, లక్ష్మీబాయి, అశ్విని, రత్నమ్మ, కళావతి, అనుపమ, జ్యోతిబాయి, పార్వతీబాయి, పార్వతి, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవిశంకర్, సోమందేపల్లి కన్వీనర్ సిద్దలింగప్ప, నాయకులు గుట్టూరు సుబ్బరాయుడు, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, పాలడుగు చంద్ర, పాల్గొన్నారు.

టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రూ. 100 నాణెం విడుదల చేయడం పట్ల బికె.పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు.

పార్థసారథి సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరిన నాయకులు

రాష్ట్రంలో వైసిపి ఇసుక మాఫియా : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక ధరను విపరీతంగా పెంచి ప్రజలను నిలువు దోపిడీ చేస్తుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నాలుగున్నర ఏళ్లలో రూ. 40 వేల కోట్లు దోచుకోన్నారన్నారు. నూతన ఇసుక పాలసీ పేరుతో రెండేళ్ల పాటు ఇసుకను అందుబాటులో లేకుండా చేసి రాష్ట్రంలో 20 లక్షల మంది కార్మికులను వీధిన పడేశారన్నారు. టిడిపి హయంలో ఉచితంగా అందించామన్నారు. వైసిపి నాయకులు ఇసుకను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారన్నారు. ఇసుక దొరక్క, భవన నిర్మాణాలు ఆగిపోయి లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు నగరాలకు వలస పోతున్నారన్నారు. జై ప్రకాష్ కంపెనీకి ఇసుక కాంట్రాక్టు అప్పగించి క్విడ్‌ప్రోకు తెర లేపారన్నారు. ఇకనైనా ఇసుకను ఉచితంగా ఇవ్వకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

'స్పందన'లో ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అందులో తన కొడుకు ఆచూకీ తెలపాలని కోరుతూ గుడిబండ మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన మాధురి ఎస్పీ ఎదుట కన్నీటి పర్యంతమైంది. తన కుమారుడైన నితిన్‌కుమార్ కనిపించడం లేదని గుడిబండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి 21 రోజులైనా ఫలితం లేదని ఆమె వాపోయింది. అతని మిత్రులపై అనుమానం ఉందని వారిని విచారించాలని కోరారు. అలాగే గోరంట్ల పట్టణంలోని ఎండలమ్మ బండ వీధిలో కాపురం ఉంటున్న ముస్లిం మహిళ ఐదేళ్ల క్రితం కదిరి పట్టణానికి చెందిన మౌలాలి అహమ్మద్‌తో వివాహం జరిగిందని, 3 నెలలు కాపురం చేసిన తర్వాత కువైట్‌కి వెళ్ళి భర్త అక్కడ వేరే మహిళను వివాహం చేసుకొని ఇప్పుడు కదిరికి వచ్చాడని తనకు న్యాయం చేయాలని వేడుకుంది. అలాగే రస్తా వివాదాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూకబ్జాలు, ఆర్థిక, సైబర్ మోసాలు, తదితర సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి 41 మంది ఫిర్యాదులు చేశారు. ఎస్పీ వాటిని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులతో ముఖాముఖి మాట్లాడి సంబంధిత స్టేషన్ అధికారులతో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎస్పీ నడవలేని ఫిర్యాదుదారుల వద్దకే వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందనలో అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, ఎఎస్పీ ఎస్.విష్ణు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్, ఎస్పీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మహిళ

ఇంకుడు గుంతల పనులు పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వర్షం నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని ఉపాధి హామీ సిబ్బంది పేర్కొన్నారు. మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో సోమవారం సచివాలయం ముందు ఏర్పాటుచేసిన వర్షం నీటి నిల్వ ఇంకుడు గుంతలను ఉపాధి హామీ ఇంజినీర్ అన్నపూర్ణాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ పుష్పలత పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయిన పెడపల్లి, బత్తలపల్లి, నిడిమామిడి గ్రామాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశామన్నారు. వీటి వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వారు తెలిపారు. ఈ ఇంకుడు గుంతల వల్ల చుట్టుపక్కల భూగర్భ జలాలు అభివృద్ధి చెందడంతో పాటు చుట్టూ ఉన్న బోర్లు, రీఛార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతను, పనితీరును వారు పరిశీలించి కొలతలు తీసుకున్నారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు, వెంకటేష్, ఉపాధి సిబ్బంది, ఉన్నారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు వారి వారి ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తవ్వించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సిద్దారెడ్డి, హౌసింగ్ ఎఇ రమణారెడ్డి, ఎపిఒ నాగిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఇంజినీరింగ్, ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టం ద్వారా 92 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని వాటిని ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులు త్వరతిగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. కొత్తచెరువులో 10 పూర్తయ్యాయని, కేసాపురం, బండ్లపల్లి, మీర్జాపురం కాలనీల్లో మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న వెంకటేష్‌రెడ్డి

రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులుగా వెంకటేష్ రెడ్డి

హిందూపురం : రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులుగా రెండో సారి హిందూపురం పట్టణాని చెందిన సడ్లపల్లి వెంటకేష్‌రెడ్డిని నియమిస్తూ సోమవారం గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, రాష్ట్ర రెడ్డి జెఎసి సలహాదారు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అందులో తనకు రెండవ సారి జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించారన్నారు. జిల్లా వ్యాప్తంగా రెడ్లను అందరినీ కలుపుకొని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నాయనపల్లిలో 'గడప గడపకూ'

లేపాక్షి : మండల పరిధిలోని నాయనపల్లి గ్రామపంచాయితీలో సోమవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ముందుగా ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణస్వామి, జడ్పిటిసి బాణాల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచి వసుంధర ప్రభాకర్, వైస్ ఎంపిపి లీలావతి, సింగిల్‌విండో అధ్యక్షులు శంకరప్ప, కంచి సముద్రం ఎంపిటిసి ఆదినారాయణ, కోడిపల్లి సర్పంచి మంజునాథ్, పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణకు సన్మానం

పెనుకొండ : పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ ను మరోసారి శ్రీసత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షునిగా నియమించినందుకు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం వైస్ ఎంపిపి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మీద నమ్మకంతో మరోమారు పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు పార్టీ అధినేత, సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి, సర్పంచి ఆదినారాయణ, వెంకట్రాముడు, మారుతి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ నియోజకవర్గంగా రిజర్వు చేయాలని వినతి

పెనుకొండ : నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో అత్యధికంగా ఎస్సీ సామాజిక వర్గం ఉన్నందున రాబోయే ఎన్నికల్లో ఎస్సీ రిజర్వు నియోజకవర్గంగా గుర్తించాలని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నేతృత్వంలో సోమవారం సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతిపత్రం అందజేసి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.రామాంజనేయులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, డివిఎంసి మెంబర్ ఎంఎన్ మూర్తి, ఎమ్మార్పీఎస్ పెనుకొండ డివిజన్ అధ్యక్షులు తిమ్మాపురం నరసింహులు, సీనియర్ పాత్రికేయులు ఎస్.రావూఫ్, కౌన్సిలర్ శేషాద్రి, వైఎపి వెంకటేశులు, తిమ్మాపురం గంగన్న, ప్రసాద్, రొద్దం రామకృష్ణ, పెడబల్లి వెంకటేశులు, క్రిస్టఫర్, జయశంకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎ.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వివిధ సమస్యలపై సచివాలయం వచ్చే ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించాలని, పెండింగ్ లేకుండా ప్రతి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీవో కాలనీ, సైదాపురం సచివాలయాలను సోమవాం ఎమ్మెల్యే సందర్శించి సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. ఆ సచివాలయాల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై సిబ్బంది, వాలంటీర్లతో చర్చించారు. హౌసింగ్, పింఛన్లపై ఆరా తీశారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు, వెకేట్ ల్యాండ్ టాక్స్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ బండ్లు రాలేదనిస్థానికులు ఫిర్యాదు చేయగా స్పందించిన ఎమ్మెల్యే కమిషనర్‌తో మాట్లాడగా బండి రిపేరీలో ఉందని రెండు రోజుల్లోగా యధావిధిగా ప్రతిరోజూ చెత్త సేకరించేలా చూస్తామన్నారు. వాలంటీర్ పరిధిలో 18 ఏళ్ల పూర్తయిన వారి చేత ఓటరుగా నమోదు చేయించాలని వాలంటీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నజీమున్నిసా, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీచేస్తున్న ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి

ఎమ్మెల్యే తిప్పేస్వామికి సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) బోర్డు మెంబర్‌గా నియమితులైన ఎమ్మెల్యే తిప్పేస్వామిని సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే తిప్పేస్వామి మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. సిఎం జగన్ బడుగు బలహీన వర్గాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో మారుమూల నియోజకవర్గంలోని ఎమ్మెల్యే తిప్పేస్వామిని టిటిడి బోర్డు మెంబర్‌గా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో జయరాజు, వైస్ ఛైర్మన్ రామచంద్రరెడ్డి, వెంకటలక్ష్మమ్మ సింగిల్‌విండ్ అధ్యక్షుడు రామిరెడ్డి, ఎంపిపి కవిత సత్యనారాయణరెడ్డి, వాల్మీకి సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, ఎస్ఎన్ కృష్ణమూర్తి, అన్సర్, శీన, గోపి, అంజలి, మధు, సుధాకర్‌నాయక్, ఈశ్వర్, మేఘన, రమేష్, తదితరులు పాల్గొన్నరు.



ఎమ్మెల్యే తిప్పేస్వామి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

వడ్డెర్లపై దాడిని నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి-గోరంట్ల

మండల పరిధిలోని వెంకటరమణపల్లి గ్రామంలో వడ్డెర్లపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వడ్డెర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవాం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వడ్డెర్లతో కలిసి పట్టణ వీధుల గుండా ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం చేరుకుని తహశీల్దార్ రంగనాయకులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవళ్ల మురళి మాట్లాడుతూ ఇటీవల కాలంలో వడ్డెర్లపై అగ్రవర్ణాల దాడులు ఎక్కువయ్యాయన్నారు. బండరాళ్లు కొట్టుకొని జీవనం సాగిస్తున్న వారిపై దాడులు చేయడం దారుణమన్నారు. ఇతర ప్రాంతాల నుంచి రౌడీలను తీసుకొచ్చి వెంకటరమణపల్లిలో వడ్డెర్లపై దాడి చేయించడం దుర్మార్గమన్నారు. వడ్డెర్లు పశువులు, ఎరువు వేసుకుంటున్న స్థలానికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వడ్డెర్లపై భవిష్యత్తులో దాడులు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

వడ్డెర్లపై దాడిని నిరసిస్తూ ర్యాలీ చేపట్టిన సంఘం నాయకులు

కర్నాటక మద్యం పట్టివేత

రొద్దం : అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో పోలీసులు సీజ్ చేశారు. హుసేన్‌పురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం మండలంలోని కొగిర గ్రామానికి కర్నాటక మద్యం(100 టెట్రా పాకెట్లు)ను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ నాగస్వామి పోలీసు సిబ్బందితో వెళ్లి మండల పరిధిలోని రాచురు సమీపంలో పట్టుకున్నారు. అలాగే అతడి నుంచి మద్యం, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో పోలీసు పోతన్న, తదితరులు పాల్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-లేపాక్షి

మండల పరిధిలోని కంచిసముద్రం రోడ్డులో సోమవారం సాయంత్రం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో హిందూపురం మండల పరిధి లోని కొట్నూరు గ్రామం వద్ద ఉన్న ఇందిరమ్మ కాలనీకి చెందిన రాజు కాలు విరిగింది. దీంతో స్థానికులు అతడిని 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE, HINDUPUR
O.S.NO.18/2020

Between:-
P.Jayachandra. **...Plaintiff**
AND
P.Jayalakshmamma and 6 others. **...Defendants**

NOTICE TO DEFENDANT No 1,2,3,5 & 6

D1:Palyam Nagalakshmamma w/o Late P.Narayanappa, R/o KanisettyPalli aged about 57years, Hindu, cultivation, Now Residing at Bellala Cheruvu Village, Palasamudrum Post, Gorantla Mandal

D2:Palyam Venkatramappa, S/o Late P.Narayanappa, R/o KanisettyPalli , aged about 32years, Hindu, cultivation, Now Residing at Bellala Cheruvu Village, Palasamudrum Post, Gorantla Mandal.

D3:P.Adilakshmi D/o Late P.Narayanappa, R/o KanisettyPalli , aged about 35years,Hindu, cultivation, Now Residing at Bellala Cheruvu Village, Palasamudrum Post, Gorantla Mandal. Anantapuramu Dist. Now Sri Sathya Sai Dist.

D5:J.Hanumantha Reddy S/0 J.Nallapa Reddy, R/o Ammavaripalli Village, aged about 56 years, Hindu, cultivation, Gutturu post, Penukonda mandal.

D6:Rama Chandra S/o Late P.Hanumanthappa, R/o Ammavaripalli Village, aged about 55years, Hindu, cultivation, Gutturu post, Penukonda mandal.

Whereas the plaintiff has instituted a suit against you for partition. The suit is posted for your appearance on 25-09-2023 at 10-30 AM. You have to appear before the said court in person or through advocate on the above date in the above court without fail, failing which, the matter will be decided in your absence.

Heg Date: 25-09-2023

(By order of the court)

A.Nagaraju, B.A.,LL.B.,
Advocate, Hindupur Roll No.AP.404/1991

సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరాకు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన ఎన్.రఘువీరారెడ్డిని సోమవారం మండల పరిధిలోని నీలకంఠాపురంలో ఆయన నివాసంలో డిఎచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు సన్మానించారు. ఈ సందర్భం గా హనుమంతు మాట్లాడుతూ ఎపిలోని మారుమూల ప్రాంతమైన నీలకంఠాపురం గల్లీ నుంచి ఢిల్లీ వరకూ గర్వించదగ్గ నాయకునిగా ఎదిగి అందరి మన్ననలు పొందిన అపర భగీరథుడు రఘువీరా అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. రఘువీరా జీవితంలో ఇంకెన్నో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కరియన్న, డప్పు కళాకారుల సంఘం తాలూకా అధ్యక్షడు మంజునాథ్, యువ నేత మల్లికార్జున, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నాయకులు మారుతి, రంగస్వామి, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

రఘువీరాను సన్మానిస్తున్న డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు